జాతీయ రహదారిపై ఏపుగా పెరిగిన మొక్కలు

రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, జూలై 14 : మండల కేంద్రంలోని పాత బస్టాండ్, కొత్తబస్టాండ్, తిరుమలగిరి గ్రామానికి వెళ్లే మార్గాల వద్ద జాతీయ రహదారిపై నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆత్మకూరు, తిరుమలగిరి గ్రామస్తులు కోరుతున్నారు. ములుగు-హనుమకొండ జాతీయ రహదారిపై నిత్యం రద్దీగా ఉంటుందని, ఈ క్రాస్‌ల వద్ద వాహనాలు దాటుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డివైడర్లలో నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో అటు, ఇటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనబడడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పెరిగిన చెట్లను జంగల్ కటింగ్ చేయించి, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ఉపాధిహామీ పనుల నాణ్యతపై నివేదిక

దామెర, జూలై 14 : మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల నాణ్యతాప్రమాణాలపై ఉన్నతస్థాయి నివేదికను సామాజిక తనిఖీ బృందాల ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు డీఆర్‌పీలు అందిస్తారని ఏపీవో శారద తెలిపారు. ఆదివారం ల్యాదెళ్ల, తక్కళ్లపహాడ్, దామెర, కోగిల్వాయి, ముస్త్యాలపల్లి, పులుకూర్తి, ఓగులాపురం, ఊరుగొండ, పసరగొండ గ్రామాల్లో ఈజీఎస్ పనులపై సోషల్‌ఆడిట్ బృందాలు నివేదికను ప్రజావేదికలో వివరించాయి. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారదర్శకంగా పనులు జరిగాయని, ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చూశామని చెప్పారు. చిన్నచిన్న తప్పులు ఉంటే ఈ నెల 16న మండల పరిషత్‌లో జరిగే సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : బీరన్న గుడి వద్ద మొక్కులు చెల్లిస్తున్న కుల పెద్ద మనుషులు

ఘనంగా బీరన్న బోనాలు

ఆత్మకూరు, జూలై 14 : గొల్ల, కురుమల ఆరాధ్య దైవం బీరన్న బోనాల పండుగను ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరు, గూడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లోని గొల్ల, కురుమలు బీరన్న దేవునికి మొక్కులు సమర్పించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం యాటలు బలి ఇచ్చారు. కార్యక్రమంలో కుల పెద్దమనుషులు ముద్దం మల్లయ్య, కాడబోయిన

గూడూరులో బోనాలతో వెళుతున్న మహిళలు

రవి, కాడబోయిన జగన్, అంజలి రమేశ్, మంతుర్తి రవి, దుంక దువ్వరాజు, సంగిరెడ్డి నాగరాజు, గంగినేని సతీశ్, సంతోశ్, మారబోయిన సాంబయ్య, మారబోయిన రవికుమార్, మిర్యాల కుమార్, ఎల్లబోయిన రవి పాల్గొన్నారు.

గూడూరులో..

కమలాపూర్ : మండలంలోని గూడూరు గ్రామంలో కురుమ కులస్తులు బీరన్న బోనాల పండుగ నిర్వహించారు. తొలిఏకాదశి పండుగ పురస్కరించుకుని మహిళలు ఇంటికో బోనం చేసుకుని డప్పు చప్పుళ్లతో బీరన్న ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. పంటలు బాగుండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కురుమ కుల పెద్దలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

PLOT FOR SALE

★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

'పట్టణ ప్రగతి' నిధులు కట్

- గత ప్రభుత్వంలో ప్రతి నెలా విడుదల
- కాంగ్రెస్ హయాంలో నిధులు నిలిపివేత
- బిల్లుల చెల్లింపులూ లేవు

వరంగల్, జూలై 14 : పట్టణాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమం నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కట్ చేసింది. 2020 ఫిబ్రవరిలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించిన కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నెలా క్రమం తప్పకుండా 2023 ఎన్నికల కోడ్ వచ్చే వరకూ గ్రేటర్ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేసింది. పట్టణ ప్రగతిలో భాగంగా డివిజన్లలో పర్యటించిన ప్రజాప్రతినిధులు సమస్యలను గుర్తించి, పట్టణ ప్రగతి నిధులతో అభివృద్ధి పనులను చేపట్టారు. తొలుత ప్రతి నెల రూ.7 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు నిధులు విడుదల చేశారు. ఏటా పట్టణ ప్రగతి ద్వారా గ్రేటర్‌కు సుమారు రూ.40 కోట్ల నిధులు వచ్చేవి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టణ ప్రగతి నిధులను నిలిపివేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రగతి కింద పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. మరికొన్ని పనులు మధ్యలో ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం పట్టణ ప్రగతి నిధులు విడుదల చేస్తుందా? లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

నయా పైసా విడుదల చేయలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నయా పైసా కూడా పట్టణ ప్రగతి కోసం నిధులు విడుదల చేయలేదు. దీంతో అనేక అభివృద్ధి

పనులు నిలిచిపోయాయి. ప్రతి నెలా వచ్చే నిధులను నిలిపివేయడంతో నగర అభివృద్ధికి బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ నాటి నుంచి ఇప్పటి వరకూ పట్టణ ప్రగతి నిధులు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, సుమారు 8 నెలలు అవుతున్నా నిధులకు మోక్షం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఒక్క గ్రేటర్ కార్పొరేషన్‌కే పట్టణ ప్రగతి ద్వారా రూ.128.85 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇందులో గ్రేటర్ అధికారులు రూ. 182.42 కోట్ల పనులకు మంజూరు ఇచ్చారు. ఇప్పటికే రూ. 136 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో పట్టణ ప్రగతి పనుల బిల్లుల రాక కాంట్రాక్టర్లు అవస్తలు పడుతున్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులను కలుపుకొని జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం గ్రేటర్‌కు నిధులను విడుదల చేసింది. ఈ పథకం ప్రారంభమైన ఏడాది వరకు గ్రేటర్‌కు ప్రతి నెల రూ.7.34 కోట్ల నిధులు వచ్చాయి. తర్వాత కొద్దిగా నిధుల మొత్తాన్ని తగ్గిస్తూ క్రమం తప్పకుండా ప్రతి నెలా విడుదల చేశారు.

రూ.12 కోట్ల పెండింగ్ బిల్లులు

పట్టణ ప్రగతి పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.12 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిగా పట్టణ ప్రగతి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో చిన్నచిన్న కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి నెలా నిధులు విడుదలైనందున కాంట్రాక్టర్లు పనులను చేసేందుకు పోటీలు పడ్డారు. ప్రభుత్వం మారి ఒక్కసారిగా నిధుల విడుదల నిలిచిపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. పట్టణ ప్రగతి పథకం ద్వారా కాలనీలలో రోడ్లు, డ్రైడేజీలు, శ్మశాన వాటికలు, పార్కులను అభివృద్ధి చేశారు. పట్టణ ప్రగతి నిధులతోనే గ్రేటర్‌లో వెయ్యి సీట్ల పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్మించారు. గ్రేటర్ మొత్తంగా 591 అభివృద్ధి పనులను చేపట్టారు. దీనిలో 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సంప్రదాయ దుస్తుల్లోనే దర్శించుకోవాలి

వరంగల్, జూలై 14 : నగరంలోని భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఈవో శేషుభారతి తెలిపారు. ఇటీవల అమ్మాయిలు ఫ్యాషన్‌గా జుట్టు విరబోసుకుని అమ్మవారి దర్శనానికి వస్తున్నారని, అలా రాకూడదని తెలిపారు. అమ్మాయిలు లంగావోణి ధరించి, సంప్రదాయంగా జడ వేసుకోవాలని, కనీసం జుట్టుకు రబ్బర్ బాండ్ పెట్టుకుని రావాలని సూచించారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, జూలై 14 : బల్దియా కార్యాలయంలో ఈ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల వల్ల గ్రీవెన్స్‌ను రద్దు చేస్లున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇచ్చేందుకు కార్యాలయానికి రావొద్దని కోరారు.

కేయూ ప్రొఫెసర్ సురేశ్‌లాల్‌పై కేసు

సుబేదారి, జూలై 14 : బిల్డింగ్ నిర్మాణ పనులు అడ్డుకొని, పిల్లర్లను కూల్చివేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదుతో కేయూ ప్రొఫెసర్ బానోత్ సురేశ్‌లాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మారపల్లి సుజన్‌కుమార్ మాట్లాడుతూ హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డులో సర్వేనంబర్ 208లో తనకున్న 469 గజాల ఇంటి స్థలంలో మున్సిపల్ అనుమతితో భవనం నిర్మిస్తున్నానని తెలిపాడు. అయితే,ప్రొఫెసర్ సురేశ్‌లాల్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 207 పేరుతో తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి, ఆ ప్లాట్ తనదేనని బిల్డింగ్ నిర్మాణ పనులను జేసీబీ, మనుషులతో కూల్చివేశాడని ఆరోపించారు. బాధితుడు సుజన్‌కుమార్ ఫిర్యాదు చేయగా, సురేశ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

కమిషనరేట్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు

సమాచారం అందిస్తే నగదు పురస్కారం : సీపీ అంబర్ కిశోర్‌ఝా

సుబేదారి, జూలై 14 : మత్తు పదార్థాల నియంత్రణ కోసం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా గంజాయి ఇతర మత్తు పదార్థాలను నియంత్రించడానికి ఈ డ్రగ్స్ టీం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, సేవించే ప్రాంతాలపై ఈ టీం నిఘా పెట్టి, ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించిన వెంటనే 871258 4473 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తులకు నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. గంజాయి రహిత పోలీసు కమిషనరేట్ కోసం అందరూ కృషి చేయాలని సీపీ ఒక ప్రకటనలో కోరారు.

'ముదిరాజ్‌ల డిమాండ్లు నెరవేర్చాలి'

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వేలేరు, జూలై 14 : ముదిరాజ్‌ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వేలేరు మండల ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్ ఆదేశాల మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రూపొందించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టబోయిన భూపతిరాజ్, సంపత్, సంపత్ పాల్గొన్నారు.

హనుమకొండ బస్‌స్టేషన్‌లో మరమ్మతులు

- ప్రాంగణంలో సీసీ నిర్మాణం
- గుంతల రోడ్డుకు ప్యాచ్ వర్క్స్
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. చిన్న చినుకే చెరువును తలపిస్తున్న బస్‌స్టేషన్ ప్రాంగణంతోపాటు రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. ఈ నెల 4న 'గుంతలున్నాయ్ జాగ్రత్త' శీర్షికన నమస్తే తెలంగాణ పత్రిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్ ప్రాంగణంలో నీళ్లు నిల్వకుండా రోడ్డును చదును చేసి, నూతనంగా సీసీ వేశారు. అలాగే, గుంతలుపడి ప్రమాదకరంగా మారిన రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేసి, గుంతలను పూడ్చారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణంలో వేసిన సీసీ

హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులో ఏర్పడిన గుంతలను పూడ్చిన అధికారులు

నగరంలో ఆదివారం వాన దంచికొట్టింది. దీంతో పలు కాలనీలు జలమయంగా మారాయి. రాత్రి కురిసిన వర్షానికి హనుమకొండ రెడ్డికాలనీలోని ఓ వీధిలో ఇలా వర్షపు నీరు నిలిచింది.

నేడు జగన్నాథ రథయాత్ర

కాశీబుగ్గ, జూలై 14: ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వరంగల్‌లో జగన్నాథుడి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ టెంపుల్ కోఆర్డినేటర్ దమేశ్వర ధర్మేంద్రదాస్, భూపావన హరినామా దాస్ అన్నారు. ఆదివారం 3వ డివిజన్ ఆరెపల్లిలోని ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి రథయాత్ర ప్రారంభమై హనుమకొండ చౌరస్తా మీదుగా ములుగురోడ్డు జంక్షన్, ఎంజీఎం, పోచమ్మమైదాన్ జంక్షన్ల మీదుగా వెంకటేశ్వర గార్డెన్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. రథయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

సుబేదారి, జూలై 14 : పోగొట్టుకున్న ఫోన్లను హనుమకొండ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో ఆదివారం నలుగురు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్లు రికవరీలో ప్రతిభ చాటిన పోలీసు సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ సతీశ్ అభినందించారు.

ఎల్కతుర్తిలో అరుదైన శిల్పాలు

ఆదిత్యుడి శిల్పం

- పలు పురాతన విగ్రహాలు లభ్యం
- 10, 11వ శతాబ్దానికి చెందినవిగా గుర్తింపు

భీమదేవరపల్లి, జూలై 14 : ఎల్కతుర్తి మండల కేంద్రంలో అరుదైన ఆదిత్యుడి శిల్పం లభ్యమైంది. ఆదిత్యుడి(సూర్యభగవానుడు) విగ్రహంతో పాటు చాముండి, విఘ్నేశ్వరుడు, నంది, హనుమాన్ విగ్రహాలు సైతం ఇక్కడ ఉన్నాయి. కనుకదుర్గాదేవి ఆలయ సమీపంలో ఈ విగ్రహాలు మట్టిలో కూరుకుపోయి నిరాదరణకు గురవుతున్నాయి. సూర్యభగవానుడు కిరీటమకుటం, హార, గ్రైవేయకాలు, చెవులకు జూకాలు, కరకంకణాదులు, రెండు చేతుల్లో తామర మొగ్గలతో సమపాదస్థానక భంగిమలో ఉన్నాడు. పక్కనే ఉన్న నంది విగ్రహం సైతం అరుదైన శైలిని పోలి ఉంది. పొట్టికొమ్ములు, ముఖపట్టకంతో రిక్కించిన చెవులు, మెడకు కట్టిన రెండు వరుసల పూసలదండలు, ఎత్తైన మూపురం, నడుం మీద కీర్తిముఖంతో ముందుకు మెడకిందకు, వెనుకతోక కిందివైపు వేసిన చిరుగంటల పట్టెడలతో కూర్చుని ఉన్న నంది చక్కని శిల్పనైపుణ్యంతో ఉంది. వీటితో పాటు హనుమాన్, చాముండీతో పాటు పూర్తిగా నేలలో కూరుకుపోయిన విఘ్నేశ్వరుడి విగ్రహాలు ఉన్నాయి. ఆదిత్యుడి శిల్పం, నంది విగ్రహాలు 10, 11వ శతాబ్దంలో కల్యాణి చాళుక్యుల కాలానికి చెందినది కాగా, చాముండీ విగ్రహం, హనుమాన్ విగ్రహాలు 16, 17వ శతాబ్దానికి చెందినదిగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ నిర్ధారించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఈ విగ్రహాలను చాలా ఏళ్ల కిందటే తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

నిరాదరణకు గురవుతున్న విగ్రహాలు

నంది విగ్రహం

కళావిహీనంగా పడి ఉన్న చాముండి విగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

హనుమకొండ, జూలై 14 : డ్రగ్స్ రహిత సమాజం కోసం హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ కృషి చేస్తుందని చైర్మన్ డాక్టర్ పీ విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రెడ్‌క్రాస్‌లో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు నిర్ణయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నేటి యువత భావితరాలకు ఆదర్శంగా నిలవాలంటే డ్రగ్స్‌కు బానిస కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డాక్టర్ కే సుధాకర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఆయనను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డాక్టర్ హెచ్ సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మార్కండేయ పరపతి సంఘం కమిటీ

వేలేరు, జూలై 14 : మండల కేంద్రంలోని మార్కండేయ పరపతి సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జెల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా మంద రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి శ్రీనివాస్, కోశాధికారిగా కూరపాటి సురేశ్, డైరెక్టర్లుగా విజయ్‌కుమార్, ప్రసాద్, వేణు, మల్లేశ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని సన్మానించారు.

కలెక్టరేట్‌లో నేటి గ్రీవెన్స్ రద్దు

హనుమకొండ, జూలై 14 : హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ మందిరంలో సోమవారం రైతు భరోసా కార్యక్రమం ఉన్నందున గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలిసిన ప్రభాకర్‌రెడ్డి

శివసేనారెడ్డితో ప్రభాకర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూలై 14: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కే శివసేనారెడ్డిని తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- రోడ్డు ప్రమాద గాయాలతో మృతి

అభిలాశ్ (ఫైల్)

ఐనవోలు, జూలై 14 : కొడుకును ఎట్లాగైనా బతించుకొని ఇంటికి తీసుకుపోవాలని ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పడిన ఆరాటాన్ని దేవుడు కనికరించలేదు. ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న యువకుడు 15 రోజుల నుంచి మృత్యువుతో పోరాడి చివరికి ఆదివారం ఉదయం తిరిగిరాని లోకాలకు వెళ్లిన హృదయవిదారక ఘటన మండలంలోని ఒంటిమామిడిపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ఒంటిమామిడిపల్లికి చెందిన మామిండ్ల మానస, తిరుపతి దంపతులకు కుమారుడు అభిలాశ్, కుమార్తె అక్షయ ఉన్నారు. జూన్ 30న చెల్లి సర్టిఫికెట్లు తీసుకురావడానికి మామిండ్ల అభిలాశ్(19) బైక్‌పై పున్నేల్ క్రాస్ వద్దకు వెళ్లాడు. అక్కడ లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఎంజీఎం దవాఖానలో చేర్పించగా తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ చేర్పించారు. కొడుకును బతించుకోవడం కోసం సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. యువకుడు మృత్యువుతో 15 రోజులు పోరాడి చివరకు తుదిశ్వాస విడిచాడు. చేతికంది వచ్చిన కొడుకు మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మధుమతి ఎంజీఎం మార్చురీలో అభిలాష్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. గ్రామస్తులు, స్నేహితులు అంతిమ యాత్రలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రసంగిస్తున్న స్వామిజీ

జ్ఞాన యజ్ఞ సప్తాహం ప్రారంభం

హనుమకొండ, జూలై 14 : హనుమకొండ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం యజ్ఞనంద స్వామీజీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే జ్ఞాన యజ్ఞ సప్తహం ఆదివారం ప్రారంభమైంది. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యి గండ్ల రమేశ్, డాక్టర్ పూస సురేశ్‌కుమార్, బ్రహ్మచారిణి లతికాచైతన్య, రాజయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండకోపనిషత్‌లపై స్వామి ప్రసంగించారు.

చెప్పుల షాపులో షార్ట్ సర్క్యూట్

షాప్ నుంచి పొగలు వస్తున్న దృశ్యం

సుబేదారి, జూలై 14 : హనుమకొండ చౌరస్తాలో ఓ చెప్పుల షాపులో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు, హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైరింజన్‌తో మంటలు ఆర్పేశారు. పొగ వ్యాపించడంతో హనుమకొండ-వరంగల్ రూట్‌లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పిన తర్వాత పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.